"పది రూపాయలా టోకెను. అంతరేటే?' అన్నారు వాళ్ళు.

ఒళ్ళు మండింది సింహాచలానికి.

"మీరు కట్టాల్లో ఉన్నారని నా కుర్రోడికోసం తీసుకున్న టోకెను మీకు యిత్తానన్నాను మీరిచ్చిన డబ్బుల్తో పల్లరసం గ్రటా యింటికి పట్టుకుపోదావనీ అనుకున్నాను. గదీగాకపోతే బియ్యం గింజలు కొనుక్కుని ఎలిపోదావనీ చూసేను. అంతేగాని, నేనేదో టోకెన్లు బోకరోడినమకుంటున్నారా? మీకు టోకెను ఒద్దు అనుకుంటే ఎల్లండి .. మరి!!" అంటూ విరాగ్గా అక్కడనుంచి నాలుగడుగులు వేసేడో లేదో అతని చెయ్యి పట్టుకుని ఆపేరు వాళ్ళు.

"ఆగవయ్యా నాయనా!! అంత కోపమయి తే ఎలాగ?" అంటూ ఆపి, సింహాచలం బరువుగా కదులుతున్న టోకెను తీసి వాళ్ళ కందించాడు. వాళ్ళు గబగబా వెళ్ళి లైన్లో నించున్నారు.




సింహాచలం కళ్ళు ఆనందంగా మెరిసేయి. మొత్తం మీద పనిజరిగిపోయిందన్న సంతోషంతో ఉక్కిరిబిక్కిరైంది మనసు. అక్కడినుంచి సరస్వతీ టాకీసు జంక్షన్‌వేపుగా కదిలి, సరస్వతీ టాకీస్‌కూ, హోటల్ 'ఊటీ'కి మధ్యనున్న సందులోకి అతని కాళ్ళు అడుగులు వేసేయి.

* * *

రాత్రి ఎనిమిది గంటలుదాటి మరో పావు గంట.

"గవర్నమెంటు సారాయ దుకాణం"లో రెంటరు పోస్తున్న సారాయిని గ్లాసులోకి ఒంపుకుని మరీ ఆయగా త్రాగసాగేడు సింహాచలం.

ఒకసారి అందులో మూతి పెట్టేక ఆ మూతిని బయటకు తీయడం సాధారణంగ ఉండదు సింహాచలం లాంటి మనుష్యులకు. చేతిలో డబ్బులు వచ్చేవరకూ కష్టపడో ప్రోకరేజ్ చేసో .. ఎన్నో అవస్తలు పడో ఆ డబ్బులు సంపాదించడం, ఆనక ఒళ్ళు తెలీని స్థితి వచ్చేవరకూ త్రాగి, త్రాగి రోడ్లు కొలవడం సింహాచలం వంటి వాళ్ళకు అలవాటు.

"ఏట్రో సింహాచలం!! నువ్విక్కడున్నావా? అవతల మీ ఇంటికాడ మీ ఆడది నీకోసం కంగారుపడతవుంటే!..."

త్రాగుతున్న గ్లాసులో సారాయిని అటు పెట్టి చూసేడు సింహాచలం. ఎదురుగా తెలిసిన మనిషి.

"మీ యాడది నీకోసం తెగ ఎదుకుతాంది! మీసంటోడికి వీకలమీదికి కొచ్చేసినాదంట. నువ్వుసూత్తె ఎక్కడ కనిపించలేదని తెగ యిదై పోతా, ఏడుత్త మొత్తుకుంటంది.."

అంతే! ... సింహాచలం బుర్ర తిరిగినట్లయింది. గ్లాసును అక్కడే వదిలి గబగబా బయటకు పరిగెత్తేడు.

అప్పటికే సింహాచలం పెళ్ళాం కొడుకుని భుజంమీద వేసుకుని పోలీసు బేరక్సు సెంటర్ లోనికి రావడం... సింహాచలం అక్కడికి సరిగ్గా అదే సమయానికి చేరడం జరిగింది.

గబగబా వెళ్ళి పెళ్ళాం భుజం మీద కొడుకుని అందుకుని తన భుజం మీద వేసుకున్నాడు సింహాచలం. అతని కాళ్ళు గబగబా 'ఆనంద్ క్లినిక్' వేపు కదిలేయి. అతని మనస్సులో ఆత్రం .. బాధ .. దిగులు .. ప్రోగయి సముద్రవంత కన్నీరు బయటకు ఉబకడానికి సిద్ధంగా ఉంది.

ఆఖరు టోకెను కూడ చూసి, అప్పటికి ఓ పదినిముషాలముందే డాక్టరూ, కాంపౌండరు సత్తిరాజూ కలిసి వెళ్ళిపోవడమూ జరిగింది.

సింహాచలం అక్కడకు చేరేసరికి క్లినిక్ ముందున్న తలుపుకు తాళం వేసివుంది. భోరుమన్నాడు గుండెలు జారిపోతుండగా..

"పక్కీదిలో మరో పెద్ద పిల్లల డాకటేరున్నాడ్రా సింహాచలం. అక్కడకు తీసుకుపద!"

తెలిసిన మనిషాకడు సింహాచలంతో అన్నాడు.

సింహాచలం మనస్సులో ఆశాజ్యోతి వెలిగింది.

అడుగులు తడబడుతుండగా అటువేపు నడిచేడు.

సింహాచలం భార్య సింహాచలాన్ని అనుసరించింది పరుగు లాంటి నడకతో..

* * *

డాక్టరుమూర్తి క్లినిక్ యింకా రద్దీగానే ఉంది. సింహాచలం ఆత్రంగా అక్కడకు చేరి పోయాడు భుజం మీద పిల్లవాడితో.

అక్కడ కూడ 'టోకెను' సిస్టమే కావడంతో టోకెను కోసం చూసేడతను.

అతనికళ్ళు నీళ్ళతో చిప్పిల్లసాగేయి. అతని గుండెలు జాలిగా బేలగా రోదించసాగేయి.

అక్కడంతా చిన్నపిల్లలే. అంతా జనం వరసగా, టోకెన్ల ప్రకారంగా చూస్తున్నాడు డాక్టరు మూర్తి.

కాంపౌండరు రెడ్డి ఒక్కొక్కర్నే లోపలకు డాక్టరు వద్దకు పంపిస్తున్నాడు. అటు వేపు అయోమయంగా చూడసాగేడు సింహాచలం.

"టోకెను గావాల్నా!"..

దగ్గరగా, వెనగ్గా, హఠాత్తుగా వినిపించిందో కరుకుగా ఉన్న గొంతు. అటువేపు చూసేడు సింహాచలం.

బలంగా, యింతలావు శరీరంతో, వస్తాదులా ఉన్నాడతను.

అతని చేతిలో రెండు మూడు టోకెన్లు గలగల మంటున్నాయి.

మురిపోయింది సింహాచలానికి.

"బాబ్బాబు!! దేవుడిలాగ కనిపించినావు.. మా పిల్లాడికి సీరియస్‌గా ఉంది. టోకెను యియ్యి.. డాక్టరుగారికి సూపించి బాగుసేయించుకుంటాను. ఈ డొక్కడే కొడుకు నాకు.."

బతిమాలసాగేడతన్ని.

ఆవ్యక్తి సింహాచలంకేసి ఓసారి నిర్వికారంగా చూసేడు.

"టోకెనుగావాలంటే పదేనురూపాయల వుద్ది.. అదీ నీగ్గాబట్టి .. మరోలికి అయితే ఇరవై సెప్పేవోడిని."

అదిరిపోయాడు సింహాచలం పదేనురూపాయలా అంటూ!!

"ఆ!!..పదెనురూపాయలే.. ఏటి అందర్లాటి డాక్టరనుకున్నావా ఏటి? పెద్ద డాక్టరు. పారెనెల్లి సదూకొచ్చిన మనిషి. పిల్లల స్పెసలిస్ట్. .. అందుకే ఆయన ఫీజురేటు నాగే.. ఆయన రోజూ యిచ్చే టోకెను కూడా ఖరీదే మరి!!.."

అరచేతిలో టోకెను నుంచి గలగల్లాడిస్తూ అన్నాడా మనిషి.

ఇంతలో అతనేదో చెప్తానే ఉన్నాడు సింహాచలంతో..

అయినా సింహాచలానికి అవేమీ వినిపించలేదు.

అతని కళ్ళముందు గలగల్లాడుతూ 'శబ్దం' చేసుకుంటూ తిర్గుతున్న టోకెన్లు, వాటి మధ్య జీవం లేని శరీరంతో కొడూకూ కనిపించడంతో నిలువునా, అలానే .. అక్కడే ... చతికిల పడిపోయాడు పాపం!!

*